క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కి పరామర్శ



భవాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరరావును, ఆయన కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల భీమశంకరరావు భార్య అత్తిలి భవాని మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె చిత్రపటానికి చెల్లిబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డా.అనసూరి పద్మలత, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, మాజీ ప్రజాప్రతినిధులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

వేసవి విజ్ఞాన శిబిరం



శిక్షణలో తయారు చేసిన క్రాఫ్ట్‌చిత్రాలతో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా పుస్తకపఠనం, నీతికథలు చెప్పడం, చదరంగం, హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మతల రమేష్, తెంటు సత్యనారయణ, సుబ్రహ్మణ్యం, పాడిపిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు మృతితో విషాదం

రాజమహేంద్రవరం రూరల్: విధి నిర్వహణకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందడంతో ఆ కుటుంబం ఆధారాన్ని కోల్పోయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు సోమనవారితోటకు చెందిన బొర్రానాగరాజు(40) విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం బొమ్మూరు నుంచి నిడదవోలు తాళ్లపాలెం వద్ద విధులు నిర్వహించేందుకు తోటి సిబ్బందితో కలిసి వెళ్లారు. విధులు నిర్వహిస్తుండగా డెల్టా కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినప్పటికీ రాత్రి వరకు లభించలేదు. బుధవారం ఉదయం డెల్టా కాలువలో నాగరాజు మృతదేహం లభ్యమైంది. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సత్య, పుష్ప, తల్లిదండ్రులు పుష్పావతి, సత్యనారాయణలు ఉన్నారు.

చలివేంద్రాలతో ఉపశమనం

రాజమహేంద్రవరం సిటీ: వేసవి తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని రిటైర్డ్ డీఎస్పీ మేడపాటి వీరారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి పోలీసు ఔట్ పోస్టు వద్ద రిటైర్డ్ ఏఎస్‌ఐ చిప్పాడ రుద్రబాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మంచినీరుతోపాటు మజ్జిగ అందించడం అభినందనీయమని డీఎస్పీ అన్నారు. పాలవలస బాబ్జి, వై.మీనాక్షిరెడ్డి, న్యాయవాది దాసరి మురళీ గాంధి, పాము బాబూరావు, నాని, చిన్నారి మేఘన తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

కంబాలచెరువు: స్థానిక అల్లూరి రామలింగయ్య మెడికల్ కళాశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రామనికి శక్తి టీం జిల్లా ఇన్‌చార్జినోడల్ ఆఫీసర్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేవీ సత్యనారాయన దీనికి హాజరై అవగాహన కల్పించారు. మహిళలు శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, ఎవరికైనా ఎటువంటి ఆపద వచ్చినా, ఏ సమయంలోనైనా శక్తి యాప్ ద్వారా పోలీసుల సహాయం కోరవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఐ.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాజు మృతికి సంతాపం

కంబాలచెరువు: ఏపీటీఎఫ్(1938) రాష్ట మాజీ కార్యదర్శి వై.వెంకట్రాజు మృతికి ఏపీటీఎఫ్ బుధవారం సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నగర, తూర్పుగోదావరి జిల్లా శాఖలు వెంకట్రాజు అకాల మరణానికి చింతిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు డేవిడ్ లివింగ్స్టన్, రాష్ట్ర కార్యదర్శి ఏ ఉదయ బ్రహ్మం, జిల్లా గౌరవాధ్యక్షులు వి.అప్పయ్య శాస్త్రి, నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు తాతారావు, ఎస్.గౌరీశంకర్ తదితరులు సంతాపం తెలిపారు.

యోగాతోనే ఏకాగ్రత

కడియం: యోగాతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని గ్రంథాలయ సభ్యులు భాస్కర్‌రావు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సూర్యనమస్కారాలు, యోగాపై అవగాహన కల్పించారు. నీతి కథలు చదివించారు. భగవద్గీత శ్లోకాలు, జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నీతి కథల పుస్తకాలను బహుమతిగా అందజేశారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం

- మండిపోతున్న ఎండలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- వరుసగా మూడు రోజుల నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- రాత్రుళ్లు కూడా కొనసాగుతున్న ఉక్కబోత



ఎండల కారణంగా నిర్మానుష్యంగా మారిన దేవీచౌక్

సీటీఆర్ఐ: భానుడు భగ్గుమంటున్నాడు. నగరంలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా చిన్నిపిల్లలు, వృద్ధులు ఎండ తీవ్రతకు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. గత మూడు రోజులు నుంచి నగరంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో గాలి కూడా వేడిగా వీస్తోంది. ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. బుధవారం వాతావరణం మబ్బు పట్టినప్పటికి ఉక్కబోత అధికంగా ఉండడంతో ఇంటిలోని వస్తువులు సైతం వేడిగా అయ్యాయి.

రాత్రుళ్లు కూడా ఉక్కబోత

ఉదయం నుంచే భానుడు భగభగలతో అల్లాడిన ప్రజలు సాయంత్రం అయ్యిక కాస్త చల్లబడుతుందని అనుంటారు. అయితే రాత్రి 12 గంటలకి సైతం గాలిలో తేమ శాతం పెరగడంతో ఉక్కబోత ఎక్కవగా ఉంటోంది. దీనితో ప్రజలు ఇంటిలోని ఏసీలను నిరంతంరం ఆన్‌లోనే ఉంచుతున్నారు. మంగళవారం భానుడు ఉగ్రరూపం దాల్చిడంతో జనాలు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. బుధవారం మబ్బు పట్టినప్పటికి గాలిలో తేమ శాతం 71 శాతం ఉండడంతో ఎండ తీవ్రత 45 డిగ్రీలు దాటినట్లు అనిపించింది.

చల్లని పానీయాలకు గిరాకీ

ఎండలకు తాళలేక ప్రజలు చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీంలు, చెరుకు రసాలు, ఫ్రూట్ జ్యూస్ షాపుల వద్ద జనం రద్దీగా ఉంటున్నారు. దీంతో చల్లని పానీయాలకు గిరాకీ పెరిగింది.

రోడ్లన్నీ నిర్మానుష్యం

కర్ఫ్యూ విధించినట్టు నగరం నిర్మానుష్యంగా మారిపోతుంది. మధ్యాహ్నం 12 గంటలు దాటిని తరువాత రోడ్లున్ని ఖాలీగా కనిపిస్తున్నాయి. చిరువ్యాపారులు సైతం తోపుడు బండ్లని వదలి చెట్టు నీడన సేద తీరుతున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు, కంబాల చెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ వద్ద జన సంచారం లేకుండా ఉంటోంది.

చెట్లు నరికేయడంతో..



అధునీకరణ పేరుతో చెట్లను విచక్షణ రహితంగా నరికివేయడంతో నీడన్నది కనబడటం లేదు. అన్ని కాంక్రిట్ రోడ్లు కావడంతో ఎండ తీవ్రత ఇంకా పెరిగిపోతుంది. రాజమహేంద్రవరంలో గోదావరి ప్రక్కనే ఉన్నా ఇంత వేడి పెరగడం మనం చేసుకున్నదే.

– డాక్టర్ ఎం. శ్రీదేవి, బోటని డిపార్ట్‌మెంట్ హెడ్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల

చెట్లను పెంచితే మంచిది



మనం ఇంటిలోనే కాకుండా విధిలోనూ కూడా చెట్లను పెంచాలి. దీనికి ప్రభుత్వ బాధ్యత తీసుకొని మొక్కలను ఉచితంగా పంపిణీ చేయగలిగితే ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోనూ విధిలోనూ చెట్లను పెంచుతారు. చెట్లు పెంచడం వల్ల గ్లోబింగ్ వార్మింగ్ తగ్గుతోంది. అంతే కాకుండా గాలిలో అక్సిజన్ శాతం పెరుగుతుంది.

– పి.బాబురావు, సినియర్ సిటిజన్,



వెలవెలబోతున్న కోటిపల్లి బస్టాండ్



రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్ ఇలా...

నగరాభివృద్ధిలో పన్నుల వసూళ్లు ఎంతో కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

రాజమహేంద్రవరం సిటీ: ఆస్తి పన్ను వసూళ్లకు కీలకమైన డిమాండ్ నోటీసులు వారం రోజుల్లో వినియోగదారులందరికీ అందజేయాలని డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకట రమణ పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ హాలులో రెవెన్యూ విభాగం అధికారులు, పరిపాలనా కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ పన్ను విధించాల్సిన ఇళ్లతో పాటు పన్ను పెంచాల్సిన ఇళ్లను గుర్తించడానికి సర్వే నిర్వహించాలన్నారు. బేస్ రిజిష్టర్ ఆధారంగా డిమాండ్ నోటీసులు ఇచ్చేటప్పుడు ఇళ్లకు పన్ను పెంచాల్సిన అవసరం ఉందీ, లేనిదీ గుర్తించాలని సూచించారు. అలాగే ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలన్నారు. ఇన్‌చార్జి అడ్మిన్ సెక్రటరీలు ఉన్న చోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. షాపు రూముల అద్దెలు ప్రతి నెలా10వ తేదీలోగా వసూలు చేయాలని అలాగే వాటిని రిజిష్టర్ చేయించాలని ఆదేశించారు. షాపుల లీజుల పునరుద్దరణకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు లీజు పునరుద్ధరించవలసిన షాపుల అద్దెలు బకాయిలు లేకుండా వసూలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న షాపులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీజ్ చేసిన షాపులకు వెంటనే వేలం నిర్వహించాలని సంబంధిత గుమాస్తాను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

17న ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి మండలంలో గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 17వ తేదీన హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

ఈ మేరకు రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సదరు ఇంటర్వ్యూలకు 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు వెంకటనగరం, తొర్రేడు, కోలమూరు, కాతేరు, పిడింగొయ్యి, రాజవోలు గ్రామాల దరఖాస్తుదారులు, మధ్యాహ్నం 02.30 గంటలకు బొమ్మూరు, ధవళేశ్వరం, హుకుంపేట, శాటిలైట్‌సిటి గ్రామాల దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామాల్లో తిరగా యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్

రాజమహేంద్రవరం రూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన వీర జవాన్లకు మద్దతుగా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈనెల 17, 19, 20వ తేదీల్లో గ్రామ గ్రామాన పార్టీలకతీతంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు బీజేపీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, కోకన్వీనర్ యానాపు యేసులు పిలుపునిచ్చారు. బుధవారం పిడింగొయ్యి గ్రామంలో బీజేపీ నాయకులు కరుటూరి శ్రీనివాసరావు ఇంటివద్ద బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆకుల శ్రీధర్, యానాపుయేసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించడం కోసం ఈ నెల 17, 19, 20వ తేదీల్లో జాతీయ జెండా చేత పట్టుకుని గ్రామంలో యువత, మాతృమూర్తులు, విద్యార్థులు, ఎక్స్ ఆర్మీ, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో తిరంగ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పన్నాల వెంకటలక్ష్మి, తనుబుద్ది సూర్య భాస్కరరావు, కందుకూరి మనోజ్ కుమార్, పీవీ సుబ్రహ్మణ్యం నాగులపల్లి వీరబాబు సింగవరపు రామకృష్ణ, సిద్దానీ వెంకట్, అనంతరెడ్డి, దాసరి ముత్యం, ముద్రగడ సూర్య చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి స్వర్ణాంధ్ర కృషి



మెటీరియల్ అందజేస్తున్న రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ : స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు, మగ్గం వర్క్‌ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులకు ఉచితంగా మెటీరియల్ బహూకరించారు. బుధవారం స్థానిక లాలా చెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాంబాబు మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 78వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో కుట్టు, మగ్గం వర్కులలో మహిళలకు శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు స్వర్ణాంధ్ర ప్రాంగణానికి స్వయంగా వచ్చి చేరవచ్చు నన్నారు. శిక్షణా కాలంలో ఉచిత మెటీరియల్‌తోపాటు మధ్యాహ్నం భోజనం శిక్షణానంతరం సర్టిఫికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాంబాబు కోరారు. ఇప్పటివరకు స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణా కేంద్రం ద్వారా 18 వేలకు పైబడి మహిళలకు ఉచితంగా శిక్షణ అందించామన్నారు. స్వర్ణాంధ్ర ద్వారా శిక్షణ పొందిన అనేకమంది ప్రభుత్వ పాఠశాలలలో కుట్టు టీచర్లు గాను అలాగే అనేక మంది స్వయం ఉపాధిని పొందుతున్నారు అన్నారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకే కమిషన్



హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న విజయకుమారి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): భారత రాజ్యాంగం దేశ పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, వాటిని ప్రజలకి అందించడంలో ప్రభుత్వ శాఖలు వివక్ష చూపుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రజలు ఆ హక్కులు పొందేలా జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి చేస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ భారతి సయాని మాట్లాడుతూ ప్రజల విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం పరంగా అందించాల్సిన సేవలు విషయంలో కూడా కమిషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 39 గిరిజన వసతి గృహాలు, ఎస్టీ కాలనీలు, పాఠశాలలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీ చేశామని, వారి సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను సుమోటోగా స్వీకరిస్తామని మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి తెలిపారు. ట్రైబల్ హాస్టళ్లు, ఎస్టీ కాలనీలు, పాఠశాలలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యలు ఉన్న వారు నేరుగా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఫిర్యాదులు చేసుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి, కె.విజయ కుమారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎస్.జ్యోతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రణాళిక మాజీ ఎంపీ కృషి

- బీసీ నాయకుల విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం చేయడం తగదు
- వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రణాళిక మాజీ ఎంపీ భరత్ రామ్ కృషి అని వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చుట్టూ తిరిగే భజనపరులు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అభివృద్ధి చేయలేదని విమర్శిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. మాజీ ఎంపీ భరత్ రామ్ శంకుస్థాపనలు చేసిన పనులకే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తిరిగి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.70 కోట్లతో రివర్ ఫ్రంట్ అభివృద్ధికి మాజీ ఎంపీ భరత్‌రామ్ ప్రణాళిక సిద్ధం చేసి, రూ.22 కోట్లతో శంకుస్థాపన చేశారన్నారు. అయితే సిటీ ఎమ్మెల్యే రూ.8 కోట్లతో తిరిగి శంకుస్థాపన చేశారని ఎద్దేవ చేశారు. బీపీఎస్ ద్వారా రూ.22 కోట్లు, ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.20 కోట్లు, జనరల్ ఫండ్స్ రూ.14 కోట్లు, రుడా ఫ్రండ్స్ రూ.14 కోట్లు మంజూరు కావాలని, మొత్తం రూ.70 కోట్లతో రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతుందని ధ్వజమెత్తారు. 10వ డివిజన్‌లో బీసీ నాయకుల విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం చేయడం తగదన్నారు. బీసీ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడంపై తాము వ్యతిరేకం కాదని, వీఎల్ పురం జంక్షన్ 5 రోడ్ల కూడలిలో ఏర్పాటు చేస్తున్న విగ్రహాలు నగరం విస్తరిస్తున్న దృష్ట్యా వచ్చేది పుష్కరాలు కావడం వలన రోడ్డు రద్దీ పెరుగుతుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. టీడీపీ నాయకులు ముసిని బాబురావు సొంత స్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేస్తే ముందుగా బౌండరీ వేయాలన్నారు. కింజరాపు ఎర్రన్నాయుడు, తాండ్ర పాపారాయుడి విగ్రహాల ఏర్పాటు చేయడంపై తమకు అభ్యంతరం లేదన్నారు. విగ్రహాల ఏర్పాటును మాజీ ఎంపీ భరత్ రామ్ అడ్డుకుంటున్నారంటూ టీడీపీ నాయకుల చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. గౌతమి సూపర్ బజార్‌ను అధికార పార్టీ అండదండలతో అక్రమంగా నిర్మాణం చేపట్టారని దీనిపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజలలో మార్గాని భరత్ రామ్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు చౌకబారు ఆరోపణ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సప్ప ఆదినారాయణ, ఎస్సీ సెల్ సిటీ చైర్మన్ తిరగట్టి దుర్గారావు, వీవర్స్ సెల్ అధ్యక్షులు నందం స్వామి, కొమ్మోజు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద పాలన దేశానికి ప్రమాదకరం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రకాశం నగర్ : దేశంలో హిందూ మతోన్మాద పాలన రాజ్యమేలుతుందని, ఇది చాలా ప్రమాదకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ అధికారంలో వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేయడమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయ్యాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆమె ప్రశ్నించారు. భారత దేశం వ్యవసాయ ఆధారిత దేశమని, కాగా మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. పహల్గాం దాడి సంఘటనతో యావత్తు భారతదేశం మోదీకి అండగా నిలిచిందని, అయితే మోదీ సాధించింది ఏమిటాని ప్రశ్నించారు. నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆగస్టే 6 7 8 తేదీలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి కొండలరావు , సహాయ కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ గోతులు పూడ్చాలని కలెక్టర్ ఆదేశం



సంబాలు జరుపుకొంటున్న క్వారీ ఏరియా ప్రజలతో కొండబాబు

- సంబరాలు జరుపుకొంటున్న స్థానికులు
- కొండబాబు పోరాటానికి ఫలితం

రాజమహేంద్రవరం సిటీ: ప్రమాదకరంగా తయారైన రామదాసుపేట, సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో క్వారీ తవ్విన యజమానులు గోతులను తక్షణమే పూడ్చాలని లేని పక్షంలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో బుధవారం స్థానికులు సంబరాలు జరుపుకొన్నారు. మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు నేతృత్వంలో క్వారీ గోతులు పూడ్చాలంటూ పోరాటం సాగిస్తున్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, మైన్స్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశమై ప్రమాదకరంగా తయారైన క్వారీ గోతులను తక్షణమే పూడ్చి వేసేలా అధికారులు సంబంధిత 51 సంస్థలకు నోటీసులు జారీ చేయాలంటే అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో కొండబాబు చేస్తున్న పోరాటానికి ఫలితం కనిపించడంతో బుధవారం క్వారీ సెంటర్‌లో హిజ్రాల ప్రెసిడెంట్ సోనీ ఆధ్వర్యంలో భారీగా హిజ్రాలు, స్థానికులతో కలసి సంబరాలు జరుపుకొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించిన కలెక్టర్ ప్రశాంతిని స్థానికులతో కలసి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేస్తామన్నారు. ఈ విజయోత్సవంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, స్థానిక యువ నాయకుడు గారా చంటి, ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ తిరగట్టి దండు బాబు, కాలనీ సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, దడాల ప్రకాష్ , తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్‌పై ఇసుకను వెంటనే తొలగించాలి

ధవళేశ్వరం: ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే మెయిన్ రోడ్డులో ఉన్న ఇసుకను వెంటనే తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు డిమాండ్ చేశారు. ధవళేశ్వరం మెయిన్ రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నాయకులతో కలిసి బుధవారం ఆయన ధవళేశ్వరం మెయిన్‌రోడ్డును పరిశీలించారు. ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే మెయిన్ రోడ్డులో ఐఎల్‌టీడీ సెంటర్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఇసుక మేటలు వేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇసుక లారీలు పరిమితికి మించి లోడ్‌తో రవాణా చేయడంతో ఇసుక రోడ్డుపై పడుతుందన్నారు. దీనివల్ల ప్రమాదాలు జరగుతున్నాయన్నారు. ఇసుక లారీలను సిటీలోకి అనుమతి లేదని చెబుతున్నప్పటికీ, ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్ ప్రాంతం వైపే ఎక్కువగా లారీలు వస్తున్నాయని రాంబాబు పేర్కొన్నారు. సమస్యపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్,సీఐటీయూ నాయకులు, బి.పూర్ణిమ రాజు, జి.రంగస్వామి, వంశీ, పండు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సదుపాయాల కల్పనే లక్ష్యం



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. హుకుంపేట, శాటిలైట్ సిటీ పంచాయతీలలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ ప్రణాళికను పటిష్టంగా అమలుచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో ఆరా తీశారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించడంతో పాటు వంద శాతం కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దీని కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. శివారు కాలనీ వరకు పర్యటించి ఏయే ప్రాంతాలలో డ్రైన్లు, రోడ్లు నిర్మించాలో సమగ్ర నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ (కమిషనర్) మాట్లాడుతూ తన పర్యటనలో డ్రైనేజీ, తాగు నీరు, పారిశుధ్య సమస్యలను ప్రధానంగా గుర్తించినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు.